క్లుప్తంగా

ఆలయంలో చోరీ

నెల్లికుదురు: లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు విగ్రహం ఎత్తుకెళ్లిన సంఘటన మండలం నర్సింహులగూడెం గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు, ఎస్సై చిర్ర రమేష్ బాబు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ పరిధిలోని కోరగుట్ల శ్రీ లక్ష్మి నర్సింహాస్వామి ఆలయంలో పనిచేస్తున్న పూజారి ఆదివారం ఉదయం ఆలయంలో పూజ చేయడానికి వెళ్లాడు. చూసే సరికి ఆలయం తలుపుల తాళం పగులగొట్టి ఉండటంతో గ్రామస్తులకు సమాచారం అందించాడు. గ్రామస్తులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు క్లూస్ టీంతో ఆలయం వద్ద వెళ్లి చూడగా సుమారు రూ.2లక్షల విలువ చేసే స్వామి వారి వెండి విగ్రహంతోపాటు తాపడం దొంగలు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. ఆలయ చైర్మన్ మద్దినేని అయిలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ట్రెయినీ ఎస్సై శివరామకృష్ణ, పోలీసు సిబ్బంది, క్లూస్ టీం సిబ్బంది, కార్యదర్శి పిట్టల మనిదీప్ ఉన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జామాండ్లపల్లి గ్రామ శివారు మున్నేరువాగు సమీపంలో పేకాట ఆడుతూ పట్టుబడిన ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశామని రూరల్ ఎస్సై వి.దీపిక ఆదివారం తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు మున్నేరువాగు సమీప ప్రాంతంలో తనిఖీలు నిర్వహించగా పలువురు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు గుర్తించామన్నారు. సంఘటన స్థలానికి వెళ్లే సరికి పేకాట ఆడుతున్న సంపత్, మహేష్, సాగర్ పట్టుబడగా శ్రీకాంత్, రాకేష్ పరారయ్యారన్నారు. వారివద్ద నుంచి రూ.1,100 నగదు, 3సెల్ ఫోన్లు, రెండు దిచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఐదుగురిపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

మహబూబాబాద్ అర్బన్: క్రమం తప్పకుండా యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం, ప్రశాంత జీవన శైలిని పొందవచ్చని కాళోజీ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్. వెంకట్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో ఆదివారం యోగా శిక్షణ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం జీవీఎస్ చారిని సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో వాకర్స్ గౌరవ అధ్యక్షుడు మైస శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పట్టాభి లక్ష్మయ్య, కోశాధికారి సోమ విష్ణువర్ధన్, వాకర్స్ సభ్యులు పగడయ్య దేవేందర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, వెంకన్న, శ్రీహరి, రాచకొండ ఉపేందర్ పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

నెహ్రూసెంటర్: జూన్ 4వ తేదీన తొర్రూరు డివిజన్ కేంద్రంలో జరగనున్న టీయూసీఐ జిల్లా మొదటి మహాసభలను జయప్రదం చేయాలని సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొత్తపల్లి రవి, బిల్లకంటి సూర్యం పిలుపునిచ్చారు. మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ జిల్లా కేంద్రంలో కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సూర్యం, రామయ్య, పాయం చంద్రన్న, మహబూబ్‌పాష, రాజు, శ్రీను, యాకయ్య, బాలు, మహేష్ పాల్గొన్నారు.

సమస్యలపై పోరాడుదాం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జర్నలిస్టులు

మహబూబాబాద్ అర్బన్: జర్నలిస్టుల సమస్యలపై ఐకమత్యంతో పోరాడి సాధించుకుందామని టీయూడబ్ల్యూజే హెచ్–143 రాష్ట్ర ఉపాధ్యక్షుడు లెనిన్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ఐఎంఏ హాల్‌లో ఆదివారం తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం(టీజేఎఫ్) రజతోత్సవం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా లెనిన్ మాట్లాడుతూ.. ఈనెల 31న హైదరాబాద్ జలవిహార్‌లో జరగనున్న రజతోత్సవ వేడుకలకు జిల్లా నుంచి జర్నలిస్టులు భారీగా తరలిరావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కన్వీనర్లు మద్దినేని గుట్టయ్య, గాడిపల్లి శేఖర్, పల్లె శ్రీనివాస్, టౌన్ అధ్యక్షుడు రమకృష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడు ఇరుకుల్ల కిరణ్ కుమార్, లక్ష్మణ్, అంబటి వెంకన్న, ప్రధాన కార్యదర్శి నల్లకుంట కరుణాకర్, కోశాధికారి తప్పెట్ల రాజు పాల్గొన్నారు.

పండ్లు పంపిణీ

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో సమ్మర్ క్యాంపులో పాల్గొంటున్న క్రీడాకారులకు కాళోజీ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు మైస శ్రీనివాస్ క్రీడాకారులకు పండ్లను ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో అథ్లెటిక్ కోచ్ దాక్షి, పీడీ పద్మావతి, క్రీడాకారులు పాల్గొన్నారు.

సవార్ లచ్చమ్మ వేడుకలు

బయ్యారం: మండలంలోని కొత్తపేట పంచాయతీ పరిధిలోని సింగారం–2 కాలనీలో ఆదివారం నిర్వహించిన సవార్ లచ్చమ్మ వేడుకలు నిర్వహించారు. ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య పాల్గొని పూజలు చేశారు. అనంతరం నిర్వాహకులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మధుకర్‌రెడ్డి, నాయకులు ప్రవీణ్‌నాయక్, సీతారాంరెడ్డి, గోపాల్‌నాయక్, బాలరాజు పాల్గొన్నారు.

నిరుపయోగంగా వసతిగృహం

- పశువులకు నిలయంగా మారిన భవనం
- మరమ్మతులు చేపట్టాలని కోరుతున్న ప్రజలు



శిథిలావస్థలో బీసీ బాలికల వసతిగృహం

గార్ల: గార్లలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో 20ఏళ్ల క్రితం రూ.21లక్షలు వెచ్చించి నూతనంగా బీసీ బాలికల వసతిగృహం భవనం నిర్మించారు. వసతిగృహం ఊరి చివర ఉందని, రాత్రి సమయంలో భయమేస్తుందని నాడు బాలికలు ఈ వసతిగృహంలో ఉండలేమని అధికారులకు మొరపెట్టుకున్నారు. బాలికల సమస్యను దృష్టిలో పెట్టుకొని గార్లలో నైజాం కాలంలో నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయం ఖాళీగా ఉండటంతో బీసీ బాలికల వసతిగృహాన్ని ఇందులోకి మార్చారు. నాటి నుంచి ఊరి చివర ఉన్న కొత్త వసతి గృహం నిరుపయోగంగా ఉండటంతో, గ్రామస్తులు పశువులు, గేదెలను మేతకు వదులుతున్నారు. వసతిగృహానికి ఆలనపాలన కరువవడంతో కొందరు తలుపులు, కిటికీలు ఎత్తుకెళ్లారు. ప్రస్తుతం గార్లలోని నైజాం కాలంలో నిర్మించిన భవనం శిథిలావస్థకు చేరుకుందని, వర్షం వస్తే కురుస్తుందని బాలికలు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం భవనం చుట్టూ ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నందున బాలికలు సైతం ఈ భవనంలోకి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా అధికారులు స్పందించి బీసీ బాలికల వసతిగృహం భవనానికి మరమ్మతులు చేపట్టి బీసీ బాలికల వసతిగృహాన్ని కొత్తభవనంలోకి మార్చాలని వసతిగృహం బాలికల తల్లితండ్రులు కోరుతున్నారు.

మరమ్మతులు చేపట్టాలి



నిరుపయోగంగా ఉన్న బీసీ బాలికల వసతిగృహానికి మరమ్మతులు చేపట్టి బీసీ బాలికల వసతిగృహాన్ని ఇందులోకి మార్చాలి. ప్రస్తుతం కొనసాగుతున్న బీసీ బాలికల వసతిగృహం శిథిలావస్థకు చేరుకొని వర్షం వస్తే కురుస్తుంది. ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఈ భవనం ఉన్నందున జిల్లా అధికారులు స్పందించి వెంటనే భవనంకు మరమ్మతులు చేపట్టి బాలికలకు భవనం అందుబాటులోకి తీసుకురావాలి.

– జి.సక్రు, గార్ల

చట్టం రద్దు చేసే వరకు పోరాటం



మానవహారం నిర్వహిస్తున్న ముస్లింలు

మహబూబాబాద్ అర్బన్: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్‌బోర్డు సవరణ నూతన చట్టాన్ని రద్దు చేయాలని వక్ఫ్‌బోర్డు పరిరక్షణ జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా కన్వీనర్ మహ్మద్ ఇక్బాల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మదర్ థెరిస్సా సెంటర్‌లో ఆదివారం ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపు మేరకు ముస్లింలు మానవహారాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఇక్బాల్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ముస్లింలను ఎన్ని ఇబ్బందులు పెట్టిన, వక్ఫ్‌బోర్డు చట్టాన్ని రద్దు చేసేంత వరకు పోరాటం ఆగదన్నారు. కార్యక్రమంలో మౌలన సయీద్ ఆహ్మద్, ముఫ్తీ అలంగిరి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఎండీ. ఫరీద్, ఈద్గా నదీమ్‌ఖాన్, సాజిద్, ఇమాముద్దీన్, రిజ్వాన్, వాహీద్, రహీం, జాకీర్, ఫజల్ పాల్గొన్నారు.

‘రైతుభరోసా’ ఎన్ని ఎకరాలకు ఇస్తారు?

- సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి



మాట్లాడుతున్న విజయసారథి

మరిపెడ: రైతుభరోసా ఎన్ని ఎకరాల వరకు ఇస్తారో స్పష్టం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సీపీఐ మండల ఐదో మహాసభ జరిగింది. కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. రబీ సీజన్ అయిపోయింది ఖరీఫ్ ప్రారంభం కాబోతున్నా ఇప్పటి వరకు నాలుగు ఎకరాల వరకే రైతుభరోసా అందించారన్నారు. మిగతా రైతుల పరిస్థితి ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఎన్ని ఎకరాల వరకు ఇస్తారో తేల్చి చెప్పాలన్నారు. అర్హత గల వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు కొత్త పెన్షన్లు అందించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లలో ఉన్న గందరగోళ పరిస్థితిని పరిష్కరించే విధంగా చర్య తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి, మరిపెడ డివిజన్ ఆత్మ చైర్మన్ నల్లు సుధాకర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు కరణం రాజన్న, మల్లెపాక యాకన్న, మండల కార్యదర్శి మారగాని బాలకృష్ణ, సహాయ కార్యదర్శి అబ్దుల్ రషీద్, పాల్గొన్నారు.

ఆయిల్‌పాం సాగుతో అధిక లాభాలు



మాట్లాడుతున్న శాంతిప్రియదర్శిని

మహబూబాబాద్ రూరల్: ఆయిల్‌పాం సాగు చేయడం ద్వారా రైతులు ఆర్థికంగా బలోపేతమవుతారని ఉద్యాన అధికారి టి.శాంతిప్రియదర్శిని అన్నారు. మండలంలోని కంబాలపల్లి గ్రామంలో ఆదివారం నిర్వహించిన రైతుసదస్సులో శాంతిప్రియదర్శిని మాట్లాడారు. వరి, తోట మిర్చి, పత్తి పంటలు సాగు చేస్తున్న రైతులు ఆయిల్‌పాం తోటల సాగు వైపునకు మారాలని సూచించారు. ఆయిల్‌పాం సాగు తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు వస్తాయని, డ్రిప్, ఆయిల్‌పాం మొక్కలకి సబ్సిడీలు ఇస్తారని తెలిపారు. పంటకి నిర్ణీత ధర ఉన్నందున 10నుంచి 14 టన్నుల వరకు దిగుబడి వస్తుందన్నారు. ప్రస్తుతం ఒక టన్నుకు ధర రూ.21,500 పలుకుతుందని, రైతులకు లాభదాయకమైన పంటగా ఆయిల్‌పాం దోహదపడుతుందని పేర్కొన్నారు. వివరాల కోసం కుమార్ డ్రిప్ నిర్వాహకుడు మల్లికంటి అశోక్ నంబర్ 97043 91904, హెచ్‌ఓ 89777 14080 సంప్రదించాలని సూచించారు. ఈ సమావేశంలో మల్యాల కేవీకే శాస్త్రవేత్త బి.క్రాంతికుమార్, రైతులు పాల్గొన్నారు.

మోదీ పాలన దేశానికి ప్రమాదకరం



మాట్లాడుతున్న శ్రీనివాస్

మరిపెడ: మోదీపాలన ఈ దేశానికి అత్యంత ప్రమాదకరమని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సాధుల శ్రీనివాస్ అన్నారు. స్థానిక ఓ ఫంక్షన్ హాలులో ఐదు రోజులపాటు జరిగే శిక్షణ తరగతులు ఆదివారం ప్రారంభం అయ్యాయి. ఈ తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. బీజేపీ ఆర్ఎస్ఎస్ కనుసైగల్లో దేశ ప్రజలను రెచ్చగొట్టే విధంగా ఉధృత వాతావరణాన్ని నెలకొల్పుతుందన్నారు. పార్లమెంట్ వ్యవస్థలో మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అలువాల వీరయ్య, సూర్నపు సోమయ్య, గునిగంటి రాజన్న, ఆకుల రాజు, ఉపేందర్, గుండగాని మధుసూదన్, బానాల రాజన్న, జిన్నా లచ్చయ్య, బోడపట్ల రాజశేఖర్, కొండ ఉప్పలయ్య, కందాల రమేష్, దొంతు మమత, షరీఫ్, తదితరులు పాల్గొన్నారు.

‘ఆయుష్మాన్’ నిధులు ఎక్కడ?

దంతాలపల్లి: కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రజలకు వైద్యం అందుబాటులోకి తీసుకురావడానికి గ్రామీణ ప్రాంతాలలో ఆయుష్మాన్ భారత్ మందిర్ (పల్లె దవాఖానా) పేరుతో ఆరోగ్య ఉపకేంద్రాలను ప్రారంభించింది. అందులోని భాగంగానే దంతాలపల్లి ఆరోగ్య కేంద్రం పరిధిలోని నర్సింహులపేట, దంతాలపల్లి ఉమ్మడి మండలాలలో 12పల్లె దవాఖానాలు ఉన్నాయి. పల్లె దవాఖానాలో గ్రామ ప్రజలకు మెరుగైన చికిత్స కోసం కేంద్ర ప్రభుత్వం సుమారు ఆరునెలల క్రితం ఒక్కొక్క పల్లెదవాఖానాకు రూ.80వేల చొప్పున నిధులు మంజూరు చేసింది. నిధులతో ఆరోగ్య ఉపకేంద్రాలలో రికార్డులు, మందుల నిల్వ కోసం ర్యాక్, చైర్, టేబుల్, నెట్, తదితర అవసరమైన వస్తువులు కొనుగోలు చేయాలి. ఓ టేబుల్, ర్యాక్, చైర్, 30 రికార్డులు మాత్రమే కొనుగోలు చేశారు. దీంతో ఆగ్రహించిన ప్రజలు ఆయుష్మాన్ నిధులు ఎక్కడ, రోగుల వైద్య సేవలకు విడుదల చేసిన నిధులను అధికారులు ఎం చేశారు అని ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులకు తెలియదా, లేక వారికి వాటాలు ఉన్నాయా అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు విచారణ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పచ్చిరొట్ట విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి

పెద్దవంగర: పచ్చిరొట్ట విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని ఏఓ స్వామి నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పచ్చిరొట్ట జీలుగ విత్తనాలు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రాయితీపై సొసైటీల్లో ఆగ్రోస్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కావాల్సిన రైతులు పట్టాదార్ పాస్ పుస్తకం, ఆధార్ కార్డు జీరాక్స్ పత్రాలతో మండల విస్తీర్ణ అధికారులను సంప్రదించాలని సూచించారు.

నెల్లికుదురు: ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని ఏఓ ఎస్‌కే యాస్మిన్ మండలంలోని వివిధ గ్రామాల రైతులను కోరారు. ఆదివారం విలేకరులతో ఏఓ మాట్లాడుతూ.. వానకాలం పంటలకు సంబంధించి పచ్చిరొట్టే ఎరువులైన జీలుగ, జనుము విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

తొర్రూరు రూరల్: మద్యం మత్తులో జరిగిన ఘర్షణలో గాయపడిన ఓ యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై ఉపేందర్ కథనం ప్రకారం.. మండలంలోని మాటేడు గ్రామానికి చెందిన ఎర్రం శివకుమార్‌తోపాటు గోపి, కృష్ణ అనే యువకులు ఈనెల 23న రాత్రి సమయంలో చెర్లపాలెం క్రాస్‌రోడ్డు వద్ద మద్యం తాగుతుండగా, పెద్దముప్పారం, తొర్రూరుకు చెందిన తిరుపతి, సంతోష్, అజయ్, రాజు, సుఫియాన్ అనే యువకులు సైతం వారి వద్దకు చేరుకుని అందరు కలసి మద్యం తాగుతుండగా.. అటువైపు వెళ్తున్న మరికొంత మంది యువకులు ఘర్షణ పడగా, అందులో ఎర్ర శివకుమార్ తలకు తీవ్ర గాయాలు కావడంతో వెంటనే తొర్రూరులోని ఓ ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స చేయించి, హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించి వైద్యం అందిస్తుండగా శివకుమార్ ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మృతి చెందగా, ఇరువురి ఫిర్యాదు మేరకు 9మందిపై కేసు నమోదు చేయగా, విచారణ తర్వాత మరికొంత మందిపై కేసు నమోదు చేసి అరెస్టు చేస్తామని ఎస్సై తెలిపారు.

కూలీలకు డబ్బులు చెల్లించాలి

నెల్లికుదురు: గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పనిచేసిన కూలీలకు డబ్బులు చెల్లించకుండా ఇబ్బందులు పెడుతున్న అధికారులపై చర్య తీసుకోవాలని బీకేఎంయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకుంట్ల వెంకన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. మండల కేంద్రంలో ఆదివారం జూన్ 8న తొర్రూర్ డివిజన్ కేంద్రలో జిల్లా 3వ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి బైస స్వామి, నాయకులు వరిపెల్లి వెంకన్న, వెంకట్‌రెడ్డి, సత్యనారాయణ, లక్ష్మణ్, నాగన్న, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



నరేష్

గార్ల: మండలంలోని కొత్తపోచారానికి చెందిన మన్నెపెల్లి నరేష్ అదృశ్యమైనట్లు నరేష్ తండ్రి జానకీరామయ్య తెలిపాడు. బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినప్పటికీ నరేష్ ఆచూకీ దొరకలేదన్నాడు. ఆదివారం గార్ల పోలీసులకు అదృశ్యంపై ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు. నరేష్ ఎవరికైనా కనిపిస్తే 94408 34184, 70131 21644 నంబర్లకు ఫోన్ చేసి తెలపాలని కోరాడు.

కాటమయ్య పండుగ

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలం వేమునూరు గ్రామంలో కాటమయ్య పండుగ వేడుకలను గౌడ కులస్తులు భక్తిశ్రద్ధలతో ఆదివారం ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్, డాక్టర్ సీతామహలక్ష్మి దంపతులు ఈసందర్భంగా బీఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు నలమాస శ్రీనివాస్, సునీత దంపతులకు నూతన దుస్తులు బహూకరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నాయిని రంజిత్, బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ లూనావత్ అశోక్, మహమ్మద్ షరీఫ్, కాంతికిషన్, శారదవెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గీత కార్మికుడికి తీవ్ర గాయాలు

తొర్రూరు రూరల్: మండలంలోని గుర్తూరు గ్రామానికి చెందిన గీత కార్మికుడు పంజాల రాజు రోజు మాదిరిగానే ఆదివారం తాటి చెట్టు ఎక్కేందుకు తాటి వనం వెళ్లాడు. చెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారి కిందపడ్డాడు. దీంతో రాజుకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే ఎంజీఎంకు తరలించారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి



కేసముద్రం: విద్యుత్‌షాక్‌కు గురై ఎద్దు మృతి చెందిన సంఘటన మండలంలోని కాట్రపల్లి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కాట్రపల్లి గ్రామంలో రెండురోజుల క్రితం గాలివాన బీభత్సానికి ఊరి చివరన పంట భూముల్లో ఉన్న విద్యుత్ స్తంభం విరిగిపడింది. ఈక్రమంలో జల్లె విజేందర్ అనే రైతుకు చెందిన కాడెద్దు మేత మేస్తూ విరిగిపడిన విద్యుత్‌స్తంభం తీగలకు తాకడంతో, విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఎద్దు మృతితో సుమారు రూ.70వేల వరకు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. కాగా గాలిబీభత్సానికి విరిగిపడ్డ స్తంభాన్ని వెంటనే విద్యుత్‌సిబ్బంది మరమ్మతు చేయకుండా నిర్లక్ష్యం వహించడం వలనే, ఈ ప్రమాదం వాటిల్లిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

అంబేడ్కర్ ఆశయసాధనకు పాటుపడాలి

- ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

తొర్రూరు రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాల సాధనకు ప్రతీ ఒక్కరు పాటుపడాలని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని మడిపెల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డితో కలిసి ఎమ్మెల్యే ఆవిష్కరించారు. మడిపెల్లి గ్రామంలో కొనసాగుతున్న బొడ్రాయి పండుగ వేడుకల్లో ఎమ్మెల్యే, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి పాల్గొని డప్పుచప్పళ్ల నడుమ ఆటపాటలతో నృత్యాలు చేసి బొనాలను ఎత్తుకున్నారు. కార్యక్రమంలో నాయకులు హమ్యానాయక్, సంతోష్, రాజశేఖర్, సోమేశ్వర్‌రావు, కిశోర్‌రెడ్డి, బాపురెడ్డి, మల్లేశంగౌడ్, రామచంద్రయ్య పాల్గొన్నారు.

మినీ ట్యాంకుబండ్‌ను అందుబాటులోకి తెస్తాం..

తొర్రూరు: తొర్రూరు పెద్ద చెరువు ప్రాంతంలో మినీ ట్యాంకుబండ్‌ను త్వరలోనే అందుబాటులోకి తెస్తామని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. రూ.3.50కోట్ల టీయూఎఫ్ఐడీసీ నిధులతో డివిజన్ కేంద్రంలోని పెద్ద చెరువు సమీపంలో కొనసాగుతున్న మినీ ట్యాంకుబండ్ నిర్మాణ పనులను ఆదివారం ఎమ్మెల్యే పరిశీలించారు. పనుల తీరుతెన్నులపై అధికారులు అధికారులను తెలుసుకున్నారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డితో కలిసి ఎమ్మెల్యే మాట్లాడారు. పట్టణ ప్రజలకు ఆహ్లాదం పంచేందుకు మినీ ట్యాంకుబండ్‌ను అందుబాటులోకి తెస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, మాజీ సర్పంచులు పెదగాని సోమయ్య, చాపల బాపురెడ్డి, మండల అధ్యక్షుడు సుంచు సంతోష్, నాయకులు సోమ రాజశేఖర్, గంజి విజయ్‌పాల్‌రెడ్డి, దొంగరి శంకర్, ముద్దసాని సురేష్, బిజ్జాల అనిల్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



బయ్యారం: జర్పులాపురంలో గురువులతో పూర్వ విద్యార్థులు



తొర్రూరు రూరల్: గుర్తూరు పాఠశాలలో..

తొర్రూరు రూరల్: మండలంలోని గుర్తూరు జిల్లా పరిషత్ పాఠశాలలో 1985–86 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు.

బయ్యారం: మండలంలోని ఇర్సులాపురం ఆశ్రమ ఉన్నత పాఠశాలలో 2007–08 బ్యాచ్ విద్యార్థులు సమ్మేళనమయ్యారు. అనంతరం నాటి గురువులను సన్మానించారు.

దంతాలపల్లి: మండలంలోని పెద్దముప్పారం గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో 1983–84 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.

తొర్రూరు: తొర్రూరు పట్టణంలోని సాహితీ హైస్కూల్‌లో 2005–06 ఎస్సెస్సీ బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం డివిజన్ కేంద్రంలో సందడిగా జరిగింది.

కేసముద్రం: మున్సిపాలిటీ పరిధిలోని ఎస్‌వీవీ హైస్కూల్‌కు చెందిన 2000నుంచి 2021 వరకు ఎస్సెస్సీ బ్యాచ్ పూర్వవిద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో కలుసుకున్నారు.

సంక్షిప్త సమాచారం

చికెన్ పాక్స్‌తో నాలుగేళ్ల చిన్నారి మృతి



మానస్ (ఫైల్)

బయ్యారం: మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం వెంకట్రాంపురం గ్రామానికి చెందిన కిన్నెర రాజ్‌కుమార్ కుమారుడు మానస్(4) కొన్ని రోజులుగా చికెన్ పాక్స్ లక్షణాలతో బాధపడుతున్నాడు. సాధారణ లక్షణాలుగానే భావించిన కుటుంబ సభ్యులు ఇంటివద్దే సపర్యలు చేశారు. పరిస్థితి విషమించి ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. చిన్నారి మృతి చెందడంతో గ్రామంలో ఇదే లక్షణాలతో బాధపడుతున్న వారు ఆందోళన చెందుతున్నారు. వైద్య సిబ్బంది గ్రామాన్ని సందర్శించి శిబిరం ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలి

నెహ్రూసెంటర్: తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న కళాకారులకు సాంస్కృతిక సారథిలో ఉద్యోగ అవకాశాలు కల్పించి, ఉపాధి అందించాలని తెలంగాణ ప్రజా నాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి కేదాసు రమేశ్ అన్నారు. ప్రజానాట్యమండలి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సంఘ కార్యాలయం వద్ద జెండాను ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు అజ్మీర వేణు, కట్లోజు పాండురంగాచారి, ఇనుగుర్తి యాకన్న, వీరవెల్లి రవి, వీరన్న, బానోత్ లింగ్యా పాల్గొన్నారు. అనంతరం మహబూబ్‌నగర్ జిల్లాలో ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన కళాకారిణి స్వప్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

డెంటల్ సర్జన్‌గా పట్టా పొందిన రితికారెడ్డి

కేసముద్రం: మండలంలోని పెనుగొండ గ్రామానికి చెందిన మాధవపెద్ది రితికరెడ్డి డెంటల్ సర్జన్‌గా పట్టా పొందారు. గ్రామానికి చెందిన కేసముద్రం మార్కెట్ మాజీ చైర్మన్ మాధవపెద్ది శశివర్ధన్‌రెడ్డి కూతురు రితికరెడ్డి, మల్లారెడ్డి వైద్య కళాశాలలో డెంటల్‌సర్జన్‌గా చదువును పూర్తి చేసింది. ఈమేరకు కళాశాలలో జరిగిన స్నాతకోత్సవంలో ఆర్టీసీ వీసీ సజ్జనార్ చేతుల మీదుగా డెంటల్ సర్జన్‌గా ఇటీవల పట్టా అందుకుంది.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

డోర్నకల్: మారుమూల, గిరిజన ప్రాంతాల యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని డోర్నకల్ ఎస్సై గడ్డం ఉమ కోరారు. మండలంలోని జోగ్యాతండాలో పోలీస్ కళా జాగృతి ఆధ్వర్యంలో చెడువ్యసనాలు, బాల్య వివాహాలు, సైబర్ నేరాలు, రోడ్డు భద్రత తదితర అంశాలపై కళా ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో సిబ్బంది రామన్న, జావెద్‌పాషా, సైదులు, కిశోర్ పాల్గొన్నారు.

పాలిసెట్‌లో విద్యార్థుల ప్రతిభ

చిన్నగూడూరు: పాలిటెక్నిక్ పరీక్ష ఫలితాల్లో మండల కేంద్రానికి చెందిన పత్తిపాక జతిన్ పాలిసెట్ ఫలితాల్లో అగ్రికల్చర్ విభాగంలో రాష్ట్రస్థాయిలో 123వ ర్యాంకు సాధించాడు. మండల కేంద్రానికి చెందినతొట్ల లక్ష్మణ్ ఎంపీసీ విభాగంలో 1245వ రాష్ట్రస్థాయి ర్యాంక్ సాధించగా, ఎంబైపీసీ విభాగంలో 992వ రాష్ట్రస్థాయి ర్యాంక్ సాధించాడు.

బొడ్రాయి వార్షికోత్సవం



పూజలో పాల్గొన్న గ్రామస్తులు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డు సాంక్రియా తండాలో బొడ్రాయి వార్షికోత్సవ వేడుకలు ఆదివారం వైభవంగా జరిగాయి. ఇందులో భాగంగా తండావాసులు కుటుంబ సమేతంగా గ్రామ దేవత సన్నిధికి బోనాలతో చేరుకుని పూజలు నిర్వహించారు.

ట్రై సైకిల్ అందజేత

దంతాలపల్లి: ఏపీజే అబ్దుల్ కలాం అకాడమి డైరెక్టర్ చిర్ర సతీష్, నేను సైతం యూత్ అధ్యక్షుడు కొక్కు ఓంకార్ ఆధ్వర్యంలో స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రానికి చెందిన దాసరి ఉపేందర్‌కు ఆదివారం బ్యాటరీ ట్రైసైకిల్‌ను అందించారు. దాత ముళ్లపుడి రమేశ్, శిరీష దంపతుల కుమారుడు అభిరామ్ పుట్టిన రోజు సందర్భంగా అందించినట్లు సతీష్ తెలిపాడు. కార్యక్రమంలో ఓంకార్, ఉపేందర్, యాకయ్య, ఝాన్సీ, మల్లయ్య, కోటమ్మ, పద్మ, సునీత పాల్గొన్నారు.